

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, ఆగస్టు 7: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెన్నెలవలస ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. 'జిల్లాలో వచ్చే ఏడాది జనవరి 18న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాం. ఈ ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75శాతం సీట్లు, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామ'ని ప్రిన్సిపాల్ పరశురామయ్య తెలిపారు.

శ్రీకాకుళంలో అసంపూర్తిగా కోడి రామ్మూర్తి స్టేడియం



గత ఐదేళ్లు.. క్రీడలకు సెలవు

- ఎన్నికలకు ముందు ఆడుదాం ఆంధ్రా పేరుతో హడావుడి
- స్టేడియం, మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు నిధులు మంజూరు చేయని జగన్ సర్కారు
- ప్రభుత్వం మారడంతో క్రీడా వికాస కేంద్రాలకు ప్రతిపాదనలు
- సీఎం సమీక్షలో జిల్లా నివేదికను చంద్రబాబుకు అందజేసిన కలెక్టర్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఐదేళ్లకోసారి నిర్వహించే ఎన్నికల్లో ప్రజాతీర్పును అనుసరించి కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంటుంది. అప్పటికే అమలులో ఉన్న అభివృద్ధి పనులను కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుంటుంది. కాగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మాత్రం.. అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 నుంచి 2019 వరకు) చేపట్టి.. పూర్తికాని అభివృద్ధి పనులకు పైసా కూడా నిధులు విదల్చలేదు. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. ప్రధానంగా స్టేడియాలు, క్రీడా వికాస కేంద్రాల గురించి కనీసం పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు 'ఆడుదాం.. ఆంధ్రా' పేరిట హడావుడి తప్ప.. అభివృద్ధి పనులు ఊసేలేదు. తాజాగా ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో ప్రభుత్వం క్రీడారంగంపై కూడా దృష్టి సారించింది. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు జిల్లాకు సంబంధించి అవసరమైన నిధులు.. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల జాబితాను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. క్రీడా వికాస కేంద్రాలు, క్రీడారంగం అభివృద్ధికి కూడా నిధులు అవసరమని.. నివేదిక అందజేశారు.

శ్రీకాకుళంలో కోడిరామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు వైసీపీ పాలనలో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు కనీసస్థాయిలో నిధులు విడుదల చేసుకోలేకపోయారు. అలాగే పాత్రునివలసలో అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కూడా రూపాయి నిధులు కూడా విడుదల కాలేదు. గత ఐదేళ్లలో ఇద్దరు మంత్రులు, ఓ స్పీకర్ ఉన్నా.. జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలు వికసించలేదు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రస్తుతం వాటికి అదనపు నిధులు కావాలంటూ ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో క్రీడాకారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులన్నీ పూర్తయి.. క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు భావిస్తున్నారు.

● కోడి రామ్మూర్తి స్టేడియం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులను గాలికి వదిలేశారు. రాజకీయంగా తొలినాలుగేళ్లు.. టీడీపీపై విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత నిధులు మంజూరు చేస్తున్నట్టు ఉత్తుత్తి జీవోలు విడుదల చేశారు. కానీ పనులు మాత్రం పూర్తిచేయలేదు. ఈ స్టేడియం నిర్మాణ పనులను ఎన్‌పీసీసీ సంస్థ చేపట్టింది. స్టేడియం పూర్తి చేసేందుకు రూ.15 కోట్లు అవసరముంది. ప్రస్తుతం రూ.4.73 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రూ.2.80కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో స్టేడియం పూర్తిచేయాలంటే మరో రూ.12 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

● మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్...

టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014-2019) పాత్రునివలస వద్ద మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శ్రీకారం చుట్టారు. రూ.6కోట్ల నిధులతో కాంప్లెక్స్ నిర్మించే బాధ్యత ఏపీ పోలీస్ హౌసింగ్ తీసుకుంది. ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి అప్పట్లో రూ.2.08 కోట్ల నిధులు విడుదలు చేశారు. రూ.41 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 'మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్' విషయాన్నే పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో.. ఈ కాంప్లెక్స్ పూర్తిస్థాయిలో నిర్మాణానికి రూ.5.5 కోట్లు అవసరమని ప్రతిపాదన పంపారు.

వికసించని.. 'కేంద్రాలు'

● నరసన్నపేటలో ఏపీ పోలీస్ హౌసింగ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న క్రీడా వికాస కేంద్రానికి(కేవీకే) మొత్తం రూ.2.57 కోట్లు నిధులు అవసరముంది. ఇందులో ఇప్పటివరకు రూ.1.39 కోట్లు విడుదలయ్యాయి. రూ.0.75కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇంకా రూ.0.43 కోట్లతో పెండింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ క్రీడా వికాస కేంద్రాన్ని ఇండోర్ స్టేడియంగా, షటిల్ కోర్టుగా మారుస్తామని మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రకటించారు. కానీ పనులు పూర్తిచేయలేకపోయారు.

● పలాసలో.. ఏపీఈడబ్ల్యుఐడీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా వికాస కేంద్రం కోసం రూ.2కోట్లు అవసరమని అప్పట్లో నిర్ధారించారు. కేవలం రూ.20 లక్షలు మాత్రమే గత ప్రభుత్వం నుంచి విడుదలైంది. చేపట్టిన పనులకు రూ.25 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ క్రీడా వికాస కేంద్రాన్ని పూర్తిచేయాలంటే.. మరో రూ.2కోట్లు అవసరమని.. అధికారులు తాజాగా ప్రతిపాదన చేశారు.

● ఇచ్ఛాపురంలో.. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న క్రీడా వికాస కేంద్రానికి రూ.2కోట్లు నిధులు అవసరం. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.20 లక్షల విలువైన పనులు చేపట్టారు. వీటికి రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. తాజాగా.. రూ.2 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు.

● శ్రీకాకుళంలో.. క్రీడావికాస కేంద్రం నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను రాజీవ్ విద్యామిషన్ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. కానీ పనులను ప్రారంభించలేదు. ప్రస్తుతం పెరిగిన ధరలు కారణంగా.. మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని జిల్లావాసులు, క్రీడాకారులు కోరుతున్నారు.

సీఎంవో నుంచి ఆరా

- దాచాల్సిన పత్రాలు.. చిత్తు కాగితాల్లోకి..
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఆర్‌డబ్ల్యూఎస్ ఫైల్స్
- ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో, ఎస్ఈ పరిశీలన
- కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారులను విచారిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్



పోలీసుల ఆధీనంలో ఉన్న పత్రాల మూటలు

పలాస, ఆగస్టు 7: అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు, ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు (కరస్పాండెన్స్) చేసిన పత్రాలు అవి. కార్యాలయం మార్పిడి జరగ్గానే వాటిని అధికారులు నిర్లక్ష్యంగా ఓ పాడుబడిన గదిలో పడేశారు. చిత్తుకాగితాలు ఏరుకునేవారు వాటిని సేకరించి.. కిలోల చొప్పున విక్రయించారు. తీరా అవి పలాసలోని ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ రక్షితనీటి పథకం) కార్యాలయానికి సంబంధించిన పత్రాలు అని తెలియడంతో అంతా నివ్వెరపోయారు. ఈ నేపథ్యంలో సీఎం కార్యాలయం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో, ఎస్ఈ వాటిని బుధవారం పరిశీలించారు. వివరాల్లోకి వెళితే..

పలాస ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని పత్రాలు దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పత్రాలను భద్రపరచకుండా అధికారులు చిత్తుకాగితాల జాబితాలో చేర్చి.. శిథిలమైన పాత కార్యాలయంలోనే విడిచిపెట్టేశారు. చిత్తుకాగితాలు ఏరుకునేవారు.. శిథిల భవనంలో కిటికీని తొలగించి.. పత్రాలన్నీ మూట కట్టి చెత్త దుకాణంలో రూ.600కు విక్రయించారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులు ఓ పనిమీద పాత కార్యాలయం తలుపులు తెరవగా అందులో పత్రాలు కనిపించలేదు. కిటికీ కూడా విరగ్గొటి ఉండడంతో.. సమీప ఎంపీడీవో కార్యాలయం సీసీ ఫుటేజీని పరిశీలించారు. వాటిని ఉదయం పూటే దొంగలు ఎత్తుకెళ్లి చిత్తుకాగితాలుగా విక్రయించారని ధ్రువీకరించారు. మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేస్తేనే.. ఈ వ్యవహారం బయటపడింది. ఆర్‌డబ్ల్యూఎస్ పత్రాలు చెత్త దుకాణంలో విక్రయించిన విషయం పత్రికల్లో రావడంతో సీఎం కార్యాలయం నుంచి వివరాలు కోరారు. దీంతో పలాస ఆర్డీవో భరత్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్‌బెనహర్ బుధవారం మధ్యాహ్నం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, చెత్త దుకాణాన్ని పరిశీలించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించడంతో కాశీబుగ్గ సీఐ విజయానంద్ సంబంధిత పత్రాలన్నీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసన్న, సిబ్బందిని ఆరా తీసి అవి 1990-2007 సంవత్సరాల మధ్యలో ఉన్నవిగా గుర్తించారు.

ముఖ్యమైన ఫైల్స్ ఉంటే చర్యలు..

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో దొంగతనానికి గురైన ఫైల్స్ ముఖ్యమైనవి కావని చెబుతున్నారు. వీటిని భద్రపరచాల్సి ఉండగా దొంగతనం జరగడం విచారకరం. సీఎంవో నుంచి కూడా వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యమైన ఫైల్స్ ఉంటే చర్యలు తీసుకుంటాం.

-గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

ఏఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నాం..

దొంగతనం తరువాత వాటిని చెత్త దుకాణానికి విక్రయించారు. దీన్ని గుర్తించి మొత్తం ఫైల్స్ స్వాధీనం చేసుకున్నాం. నిందితులను కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

-విజయానంద్, సీఐ, కాశీబుగ్గ

సిక్కోలు చేనేత బ్రాండ్‌ను నిలబెట్టాలి

- కార్మికులకు సహాయం చేసేందుకు సిద్ధం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 7: 'చేనేత రంగంలో సిక్కోలుకు.. దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ బ్రాండ్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉంద'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో చేనేత, జౌళి శాఖ, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. తొలుత కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాపూజీ కళామందిర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేదిక ఆవరణలో చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'దేశంలో వ్యవసాయ రంగం తరువాత అతి పెద్దదైన చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. నేతన్నలకు ఆదుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. మార్కెట్‌లో డిమాండ్ ఉంటే భావితరాలు కూడా చేనేత వస్త్రాలు ధరించేందుకు ముందుకు వస్తారు. చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ముద్ర రుణాలు అందించేందుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేశాం. చేనేత కార్మికులకు ఎటువంటి సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామ'ని తెలిపారు. అనంతరం తిలారు గ్రామానికి చెందిన దివ్యాంగ చేనేత కళాకారుడు మచ్చా శ్రీని వాసరావును, సీనియర్ చేనేత కళాకారులను కలెక్టర్ దుశ్శాలు వాతో సత్కరించారు.


● చేనేత, జౌళి శాఖ ఏడీ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఏపీఎస్‌హెచ్‌డీసీ ద్వారా రానున్న 15 రోజుల్లో నేత బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 15శాతం రాయితీతో నూలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు ఎండీ రమేష్ కృష్ణ, ఆర్ట్ స్వచ్ఛంధ సంస్థ కన్వీనర్ సన్యాసిరావు, ఆప్కో ఐఓ లక్ష్మీ నారాయణ, డీవో శ్రీనివాసరావు, ఏడీవోలు, చేనేత రంగ ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత ప్రదర్శనలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

డయేరియాతో వృద్ధుడి మృతి

- మెట్టవలసలో 62కి చేరిన బాధితుల సంఖ్య
- ఆస్పత్రుల్లో 38 మందికి చికిత్స



చిన్నప్పడు (ఫైల్)

జి.సిగడాం, ఆగస్టు 7: మెట్టవలసకు చెందిన గొర్లె చిన్నప్పడు(75) అనే వృద్ధుడు డయేరియా బారిన పడి మృతి చెందాడు. కొద్దిరోజులుగా డయేరియాతో బాధపడుతున్న ఆయనను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు.

● మెట్టవలసలో ఇప్పటికే పలువురు డయేరియాతో బాధపడుతూ.. శ్రీకాకుళం, రాజాం, పొందూరులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాజాగా బుధవారం మరో 12మంది దీని బారినపడ్డారు. వీరిని కూడా ఆస్పత్రికి తరలించారు. ఇప్పటివరకూ బాధితుల సంఖ్య 62కి చేరగా.. 35మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 14 మంది డిశ్చార్జి అయ్యారని వైద్యులు తెలిపారు. కొంతమంది ఇంటివద్దే వైద్యసేవలు పొందుతున్నారు. వైద్య సిబ్బంది రోజూ పాఠశాలకు వెళ్లి.. విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు. డయేరియా తగ్గుముఖం పట్టేవరకూ పాఠశాలకు సెలవులు ప్రకటించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం చిన్నప్పడు మృతి చెందగా.. అక్కడే చికిత్స పొందుతున్న కిలారి జగ్గారావు పరిస్థితి కూడా విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు స్పందించి పూర్తి స్థాయిలో డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

● ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే చర్యలు

ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిశ్రమలపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఆయన మెట్టవలస గ్రామాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. అనంతరం మండల పంచాయతీ అధికారులతో మాట్లాడారు. గ్రామ సమీపంలో ఉన్న పలు ఫౌల్ట్రీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వనరుల వద్ద శానిటేషన్, క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. ఈయన వెంట ఎంపీడీవో కె.వెంకన్నబాబు, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, ఆర్ఐ రామచంద్రరావు, అర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాగ్యలక్ష్మి, ఎంఈవోలు అరసాడ రవి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● పరిశుభ్రతను పాటించాలి

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని డీటీఎంవో వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం మెట్టవలస గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించారు. ఈమె వెంట వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు తదితరులు ఉన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీటీఎంవో వెంకటలక్ష్మి

నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు

నరసన్నపేట, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 2,449 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకం చేశారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో ప్రతీ తరగతి నుంచి విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతుతో ముగ్గురేసి సభ్యులను ముందుగా ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలి. గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభ్యుల ఎన్నిక జరగనుంది. మధ్యాహ్నం 1.30 గంటలు నుంచి కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతీ తరగతి నుంచి ఎన్నికైన మొత్తం 15 మంది సభ్యుల్లో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎన్నిక విధానం చేతులు ఎత్తడం లేదా చెప్పడం ద్వారా ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లో బ్యాలెట్ ద్వారా కూడా ఎన్నికల నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. 3 నుంచి 3.30 గంటల మధ్య మొదటి కమిటీ సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులను నియమిస్తారు. ఈ ప్రక్రియ అంతా విద్యాశాఖ జారీ చేసిన పత్రాలను పూర్తి చేసి ఎంఈవోలకు అందజేయాలి.



నరసన్నపేటలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల నిఘా

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను కూడా కొన్ని గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగే 'నాడు-నేడు' పనులు నిర్వహించిన నాయకులు.. తమ బండారం బయట పడుతుందనే ఉద్దేశంతో ఈసారి కూడా ఎస్ఎంసీ తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు మధ్యాహ్న భోజనం నిర్వాహకులను, ఆయాలను తొలగించకుండా.. తమ అనుయాయులను కొనసాగించాలంటే.. ఎస్ఎం సీలో తాము కీలకంగా ఉండాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంసీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ క్రమంలో సమస్యాత్మక గ్రామాల జాబితాను ఎంఈవోలు సేకరించి.. పోలీసులకు అందజేశారు. నరసన్నపేట పరిధిలో సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

వంశధార కుడి కాలువకు ముప్పు!


- వయోడెక్టు పైనుంచి ప్రవహిస్తున్న నీరు
- కోతకు గురవుతున్న గట్లు



హిరమండలం, ఆగస్టు 7: పాత హిరమండలం వద్ద వంశధార ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వయోడెక్టుపై నుంచి రెండు రోజులుగా నీరు కిందకు జారుతోంది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడుతుండగా పిల్ల కాలువల ద్వారా నీరు అవసరం లేకపోవడంతో రైతులు షట్టర్లు మూసేస్తున్నారు. దీంతో పొలాలకు వెళ్లాల్సిన నీరు కాలువలోనే నిండిపోతోంది. కుడి ప్రధాన కాలువ ద్వారా 648 క్యూసెక్కులు విడిచి పెడుతున్నా.. వయోడెక్టు పై భాగం నుంచి నీరు కిందకు ప్రవహిస్తోంది. సుమారు 60 అడుగుల ఎత్తు నుంచి పడుతున్న ఈ నీరు.. చుట్టూ ఉన్న పొలాల్లోకి చేరడంతో ముంపు సమస్య తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● కుడి ప్రధాన కాలువ గట్లు పటిష్ఠతకు కొన్నేళ్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో కాలువ గట్లు బలహీనపడ్డాయి. ప్రవాహ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, ఖరీఫ్‌లో 500 క్యూసెక్కుల నీరు విడిచి పెడితేనే గట్లకు తరుచూ గండ్లు పడుతున్నాయి. 2019లో వచ్చిన తితిలీ తుఫాన్ సమయంలో పాత హిరమండలం వద్ద కుడి కాలువ వయోడెక్టు నాలుగు వైపుల గట్లు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. గత ఐదేళ్లగా ఖరీఫ్‌లో కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ప్రవాహానికి.. కోత గురైన ప్రాంతంలో మట్టి కూరుకుపోయి గండ్లు పెద్దవిగా మారాయి. అలాగే వయోడెక్టుకు రక్షణగా ఇరువైపులా ఏర్పాటు చేసిన లైనింగ్‌పైకి నీరు ఉధృతిగా వస్తుండటంతో రాళ్లు చెల్లాచెదురైపోతున్నాయి. దీంతో సుమారు అరకిలోమీటరు మేర ఉన్న వయోడెక్టుకు ప్రమాదం పొంచి ఉందని రైతులు చెబుతున్నారు.

చెల్లాచెదురైన లైనింగ్



పాత హిరమండలం వద్ద కుడి కాలువ వయోడెక్టు పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో 'రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కు ను వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కు ను సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TgHS0Wqలో చూడండి.

దిక్సూచి

లాభ నష్టాలు



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్ ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

లాభాలు

- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నఈ డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

నష్టాలు

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్

విష్వక్ వినోదం



విష్వక్‌సేన్ హీరోగా నటించే 14వ చిత్రాన్ని బుధవారం ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ ఈ సినిమాకు దర్శకుడు. హిలేరియస్ ఎంటర్‌టైనర్స్ అందించడంలో అనుదీప్‌కు మంచి పేరు ఉంది. అందుకే ఈసారి కూడా ఆయన విష్వక్‌సేన్‌తో నవ్వుల వర్షం సృష్టించనున్నారని నిర్మాత చెప్పారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని, సురేశ్ సారంగం ఫొటోగ్రఫీని అందించనున్నారు. సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

థియేటర్లో చూడాల్సిన చిత్రం



నూతన నటులతో తీసిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు యదు వంశీ మీడియాతో ముచ్చటించారు. "ఒక ఊరిలో జాతర చుట్టూ జరిగే కథ ఇది. ప్రతీ కుర్రాడు ఈ సినిమాకు రిలేట్ అవుతారు. స్నేహం, రాజకీయాల చుట్టూ తిరిగే ఈ సినిమా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. అన్ని రకాలుగా ఆకట్టుకునే అంశాలున్న ఈ సినిమాను థియేటర్లో చూస్తేనే బాగుంటుంది" అని చెప్పారు.

నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి సతీవియోగం

ప్రముఖ నిర్మాత, మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సతీమణి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆవిడ వయసు 62 సంవత్సరాలు. క్యాన్సర్ వ్యాధి కారణంగా కన్ను మూసిన వరలక్ష్మి అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆ విషయంలో అమితాబ్ తర్వాత బాలకృష్ణే!

'తాతమ్మ కల' చిత్రంతో తెరంగేట్రం చేసిన నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 108 వ చిత్రం నిర్మాణంలో ఉంది. ఒక హీరోగా యాభై ఏళ్ల సినీ ప్రయాణం నిజంగా అరుదైన విషయమే. అందుకే బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుకలను సెప్టెంబర్ ఒకటిన తెలుగు చిత్ర పరిశ్రమ భారీ స్థాయిలో నిర్వహించనుంది. బుధవారం జరిగిన ఈ వేడుక సన్నాహక కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ 'మా తమ్ముడు నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయం. నాన్నగారికి వారసుడిగా పరిశ్రమలో నిలబడడమే కాకుండా ఎటువంటి పాత్రనైనా చేయగల నటుడిగా నిరూపించుకున్నారు' అన్నారు. 'ఇండియన్ సినిమా హిస్టరీలో అమితాబ్ బచ్చన్ తర్వాత సుదీర్ఘకాలం నటుడిగా ఉంటూ బాలకృష్ణ తన ప్రత్యేకత చాటుకున్నారు. ఇప్పటికీ కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గకుండా పోటీ ఇస్తున్నారు. పరిశ్రమ అంతా కలసి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు తమ్మారెడ్డి భరద్వాజ. నిర్మాతలమండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఈ వేడుక నిర్వహించడానికి మొదట బాలకృష్ణ ఒప్పుకోలేదు. కానీ ఇదొక స్ఫూర్తిదాయక కార్యక్రమంగా ఉంటుందని వివరించడంతో ఆయన అంగీకరించారు' అన్నారు.

రూ.రెండు కోట్ల విరాళం



కేరళలో వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డంతో జరిగిన విషాదం అందరికీ తెలిసిందే. ఈ విపత్తు బారిన పడిన బాధితులకు ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు విరాళాలు అందించి తమ వంతు సాయం చేశారు. బుధవారం ప్రభాస్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.రెండు కోట్ల విరాళం అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇప్పటికే ఈ విపత్తు బారిన పడిన వారి కోసం తెలుగు ఇండస్ట్రీ నుంచి చిరంజీవి, రామ్‌చరణ్ సంయుక్తంగా రూ.కోటి.. అల్లు అర్జున్ రూ.25 లక్షలు అందజేశారు.

సంపదను కాపాడేవాడూ సైనికుడే



'సరిహద్దును కాపాడేవాడే సైనికుడు కాదు... సంపదను కాపాడేవాడూ సైనికుడే' అంటున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ బచ్చన్' చిత్రంలోనిది ఈ డైలాగ్. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ బుధవారం నిర్వహించింది. హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'అమితాబ్‌బచ్చన్ గారి 'షోలే' చిత్రం విడుదలైన ఆగస్టు 15న మా సినిమా కూడా విడుదలవడం కాకతాళీయమే. ఈ సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌ను రవితేజ గారు నిర్ణయించారు' అని చెప్పారు.

నీ వెంటే మేమంతా

వినేశ్ ఫొగాట్‌కు సినీతారల మద్దతు



పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన భారత కుస్తీ క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్ పతకం సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం ఖాయమని భావించిన తరుణంలో ఆమె అనూహ్య నిష్క్రమణ దేశవ్యాప్తంగా క్రీడాభిమానులను నిరాశకు గురిచేసింది. వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడం సగటు అభిమానితో పాటు సెలబ్రిటీలను కలచివేసింది. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో పలువురు సినీ తారలు సైతం సోషల్ మీడియా ద్వారా వినేశ్‌కు ధైర్య వచనాలు చెప్పారు.

- ● పతకం గెలిచినా, గెలవకపోయినా మీరు నిజమైన ఛాంపియన్ అని అందరికీ చూపించారు. ఫలితాన్ని మీరు స్వీకరించిన తీరు, కష్ట సమయంలో మీరు చూపిన నిబ్బరం మా అందరికీ స్ఫూర్తిదాయకం. మీ స్ఫూర్తి మాలోని ప్రతి ఒక్కరిలో ప్రకాశిస్తోంది. 140 కోట్ల హృదయాలు మీతో ఉన్నాయి.
  - మహేశ్ బాబు
- ● ఎంత పోరాట పటిమ కనబరిచేవారైనా కొన్నిసార్లు కఠినమైన అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు ఒంటరి కాదు. కష్టసుఖాల్లో మేమంతా మీ వెన్నంటే ఉంటాం. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడిన మీ తీరు ప్రశంసనీయం
  - సమంత
- ● విజయమనే తూనికలో ఇమిడే ప్రతిభ కాదు నీది. నీ ఆటతీరుతో ఎంతోమందిని ప్రభావితం చేశావు. మా మనసుల్లో గొప్ప స్థానం పొందావు. మా అందరి ప్రేమాభిమానాలు నీతోనే ఉంటాయి. గర్వంగా తలెత్తుకొని నిలబడు.
  - నయనతార
- ● జాతి యావత్తుకు మీరు స్ఫూర్తిగా నిలిచారు. యోధురాలుగా కొన్ని తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి. ఇలాంటి అడ్డంకులు ఎన్ని వచ్చినా చరిత్ర సృష్టించకుండా మిమ్మల్ని ఆపలేదు. పట్టుదలను, ధైర్యాన్ని, కష్టాన్ని మీ నుంచి దూరం చేయలేవు. మీలాంటి వారు మరొకరు లేరు.
  - అలియాభట్
- ● వినేశ్ నిష్క్రమణ నిరాశ కలిగించింది. ఆమె మనందరి హృదయాలను గెలుచుకున్నారు.
  - తాప్సీ
- ● వినేశ్ నువ్వో యోధురాలివి. నిన్ను చూసి గర్విస్తున్నా. నువ్వు సాధించింది పతకాల కంటే ఎక్కువ
  - దర్శకురాలు జోయా అక్తర్
- ● మీరెప్పుడూ ఛాంపియనే
  - సోనాక్షిసిన్హా



వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు నేపథ్యంలో నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో వినేశ్ అనర్హతకు గురవడం ఆశ్చర్యపరిచింది. క్రీడాకారులు, కళాకారులు తమ బరువును అదుపులో ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా మనం అర్థం చేసుకోవాలి. ఇది మనందరికీ ఒక పాఠం. ఆమె బరువు తగ్గొచ్చు కానీ పోయినా అవకాశం అయితే మళ్లీ రాదుకదా' అని వ్యాఖ్యానించారు హేమమాలిని. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, కష్టకాలంలో క్రీడాకారిణిగా ధైర్యం చెప్పాల్సింది పోయి ఇలా కామెంట్ చేయడం తగదని నెటిజన్లు హితవు పలికారు. అనర్హత అంశం గురించి హేమమాలిని మీడియాతో నవ్వుతూ మాట్లాడారని తప్పుపట్టారు.

సమాజానికి ఉపయోగపడే సినిమాలే చేస్తా

ప్రొడ్యూసర్ టాక్



దర్శకుడు సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సింబా'. మురళి మనోహర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన రాజేందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. 'సంపత్ నంది సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేద్దాం అనే ఉద్దేశంతో ఈ కథ రాసి నా దగ్గరికి వచ్చారు. ప్రకృతి మీద ప్రేమను పెంచేలా.. పర్యావరణ పరిరక్షణపై అవగాహనను కల్పించేలా ఉంటుందీ చిత్రం. జగపతి బాబు, అనసూయ నటన సినిమాకే హైలైట్. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం కాబట్టి అదే రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. ఇకపై నేను చేసే ప్రతీ సినిమాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

విజయదశమికి 'కార్తీకేయ 3'ను ప్రకటిస్తాం



'కార్తీకేయ', 'సుబ్రమణ్యపురం', 'కథలో రాజకుమారి' చిత్రాలతో మంచి అభిరుచి ఉన్న నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు వెంకట శ్రీనివాస్ బొగ్గరం. ఆయన ఇటీవలే మీడియాతో ముచ్చటించి.. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'కార్తీకేయ 3' సినిమా గురించి ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను అందించారు.

"కార్తీకేయ' మొదటి భాగం విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా అక్టోబరులో విజయదశమి రోజున 'కార్తీకేయ 3' సినిమాను అధికారికంగా ప్రకటించనున్నాము. ఆ రోజే సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాము. 'కార్తీకేయ 2' సంచలన విజయం సాధించడంతో మూడో భాగంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. అందరి అంచనాలు నిలబెట్టుకోవడానికి స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తున్నాం. డివోషనల్ టచ్ ఉండేలా హనుమంతుడి స్ఫూర్తితో 'యతి' అనే సినిమాను.. శివుడి స్ఫూర్తితో 'మహాయోగి' అనే మరో సినిమాను నిర్మిస్తున్నాను" అని చెప్పారు.





తల్లిపాలు అమృతం కన్నా మిన్న

● పలాస ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్: తల్లిపాలు అమృతం కన్నా మిన్న అని, అయితే పాశ్చాత్య పోకడలతో పిల్లలకు తల్లిపాలు అందించకపోవడం సరికాదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితుల కారణంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగ రీత్యా డబ్బా పాలను పిల్లలకు అలవాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నవజాత శిశువుకు తల్లిపాలను అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా పెరిగేందుకు దోహద పడుతుందన్నారు. ఈ క్రమంలోనే తల్లిపాల ఆవశ్యకతను తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోం దన్నారు. క్షేత్ర స్థాయిలో తల్లిపాల అవసరాన్ని తల్లు లకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను నిర్వ హించారు.


సామూహిక శ్రీమంతంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాంప్లెక్స్‌లో బ్రెస్ట్‌ఫీడ్ రూమ్ ప్రారంభం

పలాస: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బ్రెస్ట్‌ఫీడ్ రూమ్‌ను బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రద్దీగా ఉండే కాంప్లెక్స్ లో ఇటువంటి కేంద్రాలు ప్రారంభించడం శుభపరిణామన్నారు. ప్రయాణంలో పిల్లలకు పాలి చ్చేందుకు తల్లులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని గుర్తించి వారి కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, నేతలు పీరికట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు, దడియాల నర్సింహులు, బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర(చిన్ని), సప్ప నవీన్, టంకాల రవి శంకర్ గుప్తా, గురిటి సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, పీవో లావణ్య, డీసీపీవో రమణ తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికులను ప్రోత్సహించాలి

పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించి నేత కార్మికులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొరసవాడ గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో బుధ వారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దపట్టే చేనేత వృత్తులను పరిరక్షించుకోవాలన్నారు. ఈసందర్భంగా చేనేత కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పిన్నింగ్ మిల్ అధ్యక్షుడు మంచు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేనున్నానంటూ.. భరోసా ఇస్తూ..

పాతపట్నం: వివిధ సమస్యలపై వినతులి చ్చేందుకు వచ్చిన ప్రజలకు నేనున్నానంటూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భరోసా కల్పించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన వినతులపై చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. మెళి యాపుట్టి మండలంలో ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఆఫ్‌షోర్ నిర్వా సితుల సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలను అందించారు. కొత్తూరు మండలానికి చెందిన ఓ విద్యార్థిని నందిగాం మండలంలో మృతి చెందిందని దీనిపై పలు అనుమానాలున్నాయని, మాకు న్యాయం చేయాలని బాధితులు వినతి పత్రం అందించారు. హిరమండలం నిర్వాసితులు ప్రాజెక్టు నిర్మాణాల్లో అందించాల్సిన ప్యాకేజీల్లో అన్యాయానికి గురయ్యామని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పాతపట్నం మండలానికి సంబంధించి ప్రధానంగా వీధి రోడ్లు, కాలు వలపై వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పరిశీలన



పలాసరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఆర్‌డబ్ల్యూ ఎస్ పాత కార్యాలయంలో ఫైళ్ల దొంగతనం జరిగిన విషయం తెలుసుకుని బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో భరత్‌నాయక్ కార్యాలయాన్ని వేర్వేరుగా సందర్శించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'నీటి సరఫరా కార్యాల యంలో చోరీ' శీర్షికతో బుధవారం వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఎమ్మెల్యే అధి కారులు, పోలీసులతో మాట్లాడారు. పాత కార్యాలయం వెనక భాగంలో కిటికీని తొల గించి ఫైళ్ల దొంగతనం చేయడంపై ఆరా తీశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ఫైళ్లను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఆమెకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్ల మాయ మవుతున్న వైనాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. పాతఫైళ్లను ఎందుకు దొంగిలిం చారనే అంశంపై దర్యాప్తు సాగుతుండడంతో త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. అలాగే ఆర్డీవో భరత్‌నాయక్ కూడా కార్యాలయాన్ని పరిశీలించి కార్యాలయం వెనకవైపు తొలగించిన కిటికీని పరిశీలించారు. పాత కార్యాలయాన్ని ఉపయోగిస్తున్నారా లేదా, ఫైళ్ల చోరీ అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పాత నీటి సరఫరా కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రతి పాఠశాలలో ఆధార్ డ్రైవ్ చేపట్టాలి

టెక్కలి: ప్రతి పాఠశాలలో ఆధార్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఎ.జనార్దనరావు తదితరులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సచివాలయ సిబ్బంది ద్వారా జనన ధ్రువపత్రాలు చేయించాలని, ఆధార్ కేంద్రాల వద్ద ఆధార్ సర్వీస్ రుసుం కన్నా ఎక్కువ రుసుం తీసుకోవడాన్ని అరికట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఆధార్ సవరణ, బయోమెట్రిక్ అప్‌డేట్స్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూలి పనులు మానుకొని ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఇందుకు సంబంధించి కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో భాస్కరరెడ్డి, ప్రసాద్ ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

స్వల్పంగా పెరగిన వంశధార

హిరమండలం: గొట్టా బ్యారేజీ వద్ద వంశధార నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. నిన్నటి వరకు ఇన్‌ఫ్లో తక్కువగా వచ్చేది. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో 233 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో 5800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో గొట్టాబ్యారేజీ వద్దకు చేరింది. బ్యారేజీ మూడు గేట్లు పైకెత్తి 3610 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 648 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 1614 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు వంశధార అధికారులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

హిరమండలం: సుభలయ ఆర్ అండ్ఆర్ కాలనీ పంచాయతీలో శివాలయం నిర్మాణానికి టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ బుధవారం స్థలాన్ని పరిశీలిం చారు. గ్రామానికి చెందిన చేగువేరా యూత్ యూనియన్ సభ్యులు శివాలయానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల టెక్కలి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు డీఎల్పీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటరమణ, సర్వేయర్ శ్యామలరావు, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, సర్పంచ్ లంక రోజారాణి, సభ్యులు ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మిత్రుడి కుటుంబానికి చేయూత

వజ్రపుకొత్తూరు: నగరంపల్లి హైస్కూల్‌లో 2003లో పదో తరతగతి చదివిన బగాది నాగార్జున ఇటీవల పచ్చకామెర్లతో మృతిచెందారు. ఆయన కుటుంబానికి సహచరులు బుధవారం రూ.33,200 సాయం అందించారు. సహచరుడికి కుమార్తె చదువుకు అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మృతుడి మిత్రులు ఆర్.శ్రీనివాసరావు, కణితి సూర్యారావు, ఆకుల కామేశ్వరరావు, సిస్టు గౌతం కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ మంచి కార్యకర్తను కోల్పోయింది

నరసన్నపేట: టీడీపీ మంచి కార్యకర్తను కోల్పోయిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు చింతు భాస్కరరావు మృతి చెందిన విషయం తెలుసుకుని బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కరరావు చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. భాస్కరరావు పార్టీ బలోపేతానికి పాటుపడ్డారని ఎమ్మెల్యే అన్నారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ చింతు శకుంతల, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యుడు గొలివి రామారావు కుటుంబాన్ని పరామర్శించారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

ఆ భూములు.. నిషేధిత జాబితా నుంచి తొలగింపు

నరసన్నపేట: నరసన్నపేట మండలం బొరగివలస రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబరు 18/1లో ఉన్న భూములను 22ఎ జాబితా నుంచి తొలగించడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. గతంలో ఈ భూములు రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా 22ఎ జాబితాలో చేర్చడంతో పట్టణంలోని లచ్చుమన్నపేట, తిరుమలవీధి, బజారువీధి, కలివరపుపేట, తమ్మయ్యపేట ఆదివారంపేటలోని ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సంబంధిత అధికారులతో చర్చించడంతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాలతో క్షేత్ర స్థాయి అధికారులు పరిశీలించి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ 18/1లో ఉన్న కొన్ని భూములకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.10 నాణేల చెలామణికి సహకరించండి

కోటబొమ్మాళి: మార్కెట్ రూ.10 నాణెం చెలామణి అయ్యేలా వ్యాపారులు సహకరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు, మాజీ సైనికాధికారి మెట్ట మన్మథరావు డిమాండ్ చేశారు. పది రూపాయల నాణెం చెల్లదని ఆర్‌బీఐ ఎప్పుడూ ప్రకటించలేదని, ఇతర రాష్ట్రాల్లో చెల్లుబాటవుతోందన్నారు. వ్యాపారులకు అధికారులు, బ్యాంకర్లు అవగాహన కలిగించాలన్నారు. నాణేలను నిరాకరించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బడిరుణం తీర్చుకున్న విద్యార్థినులు

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు బడి రుణం తీర్చుకున్నారు. అప్పిని కీర్తన, వాగ్దేవు భూమిక, కింజరాపు స్వాతిక, అవలంగి షణ్ముఖ ప్రియ రూ.10 వేలు విలువైన బీరువాను హెచ్‌ఎం కోత చైతన్యకు అంద జేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకివలసలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక

జలుమూరు: మాకివలస గిరిజన గ్రామంలో మౌలిక వసతులు రూప కల్పనకు ప్రణాళిక రూపొందించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించి వసతులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్న భూములను ఎల్ఎన్ పేట మండలానికి చెందిన ఊణ్ణ సత్యనారాయణ తప్పుడు రికార్డులు సృష్టించి జిరాయితీ భూములుగా స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, గిరిజనులు చేసిన ఫిర్యాదు మేరకు జేసీ గ్రామాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ భూములపై మీకు ఎటువంటి ఆధారాలున్నా చూపించాలని గిరిజనులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సీఐగా ప్రసాదరావు

కొత్తూరు: కొత్తూరు సీఐగా చింతాడ ప్రసాదరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణా కట్టడి, ట్రాఫిక్ పై దృష్టి సారించినట్టు తెలిపారు. ఇంతవరకు సీఐగా పనిచేసిన వేణుగోపాలరావుకు వీఆర్‌కు బదిలీచేసిన సంగతి తెలిసిందే.



స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వాటర్ ట్యాంకులు, పారిశుధ్య నిర్వహణ, కాలువల్లో కూడిక తీత, గ్రామాల్లో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

టెక్కలి: పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి జయంతిని పురస్కరించుకొని అర్చకులు సీహెచ్ రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదాదేవికి అభిషేకం, హారతులిచ్చారు. ఈనెల 9న శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కోటబొమ్మాళి: కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులను అందజేయాలని తహసీల్దార్ వి.అప్పలరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఈ-పంట నమోదుపై గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఖరీఫ్ ఈ పంట నమోదు ప్రక్రియను సెప్టెంబరు 15లోగా పూర్తి చేయాలని సూచించారు. కార్య క్రమంలో వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, కె.సునీత పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లపై పడిన టెలిఫోన్ స్తంభం

నరసన్నపేట: పట్టణంలోని భవానీపురంలో బుధవారం తెల్లవారుజామున టెలిఫోన్ స్తంభం విద్యుత్ వైర్లపై పడింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వైర్లను సరి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అయితే ఒరిగిన టెలిఫోన్ స్తంభం అలాగే వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలి

కోటబొమ్మాళి: గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్ అన్నారు. బుధవారం సరిసింగపల్లి గ్రామంలో గ్రామ దేవత ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా ఐక్యమత్యంగా ఉండి ఎటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఇందుకోసమే పూర్వీకులు దేవాలయాలను నిర్మించి ఏటా ఉత్సవాలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు సిమ్మ నారాయణరావు, మాజీ ఎంపీటీసీ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

టెక్కలి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ యువమోర్చా నాయ కుడు సిగిలిపల్లి సాయి బాబా కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా లో పలు వసతి గృహాల నిర్వహణ అధ్వానంగా ఉందని, ఇటీవల బీసీ, కేజీబీవీ వసతిగృహాల్లో జరిగిన విద్యార్థుల బలవన్మరణాలే ఇందుకు నిదర్శనమని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పలు లోపాలు కనిపిస్తున్నాయన్నారు. త్వరితగతిన చర్యలు తీసుకుని విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు

కోటబొమ్మాళి: జిల్లా వ్యాప్తంగా బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మెట్ట తిరుమల రావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మెట్ట మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాటం

పలాసరూరల్: ఇటీవల కాలంలో చిన్నారులు, మహిళలపై లైంగికదాడులు పెరుగుతున్నా యని, వీటిపై కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ప్రగతిశీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ అన్నారు. చిన్ననీలావతి గ్రామంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో అభద్రతా భావం పెరుగు తోందని, హింసా ప్రవృత్తి, అశ్లీల మాధ్యమాల వల్ల లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఎన్ని చట్టాలు వచ్చినా ప్రయోజనం కనిపిం చడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూవో సభ్యులు గుండమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే జీవనాధారం

హరిపురం: మొక్కలే మనిషికి జీవనాధారమని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. బాలాజీపురం గ్రామంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బాదం, కదంబ, ఉసిరి, నేరడు, వేప, మారేడు వంటి నీడనిచ్చే మొక్కలను ఆలయ ప్రాంగణంతోపాటు గ్రామానికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా నాటి ఒక్కో మొక్క ఒక కుటుంబానికి దత్తత ఇచ్చారు. వీటిని సంరక్షించాలని కోరారు. డీటీఎఫ్ నాయకులు తులసీదాసు, గవ్వ భీమారావు, నగిరి కరుణాకర్, ఎల్.లక్ష్మీనారాయణ, మాధవరావు, చిరంజీవి పాల్గొన్నారు.

అటవీ హక్కుల రక్షణకు కలిసి సాగాలి

హరిపురం: అటవీ హక్కుల రక్షణకు గిరిపుత్రులంతా కలిసి ముందుకు సాగాలని ఏఐకేఎంఎస్, ఏఐటీఎఫ్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, తాండ్ర ప్రకాష్ కోరారు. కుడుమసాయి, కిల్లోయి, సాభకోట, కొయిటాసాయి తదితర గ్రామాల్లో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఆదివాసీ రక్షణ చట్టాలను రద్దు చేసి అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన అటవీ సంరక్షణ చట్టం-2023ను రద్దుచేయాలని కోరారు. నాయకులు సార జగన్, సవర భీమరాజు, బోగేసు, చిన్నకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

సకాలంలో పౌరసేవలు అందించాలి

నరసన్నపేట: సచివాలయాల్లో పౌరసేవలు సకాలంలో అందాలని తహసీల్దార్ ఆర్. సత్యనారాయణ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పౌరసేవలపై ఆరా తీశారు. ఈవో చిన్నారావు, వీఆర్వో తాతబాబు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక చేనేత

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.పి.లత మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయాలకు, సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకగా నిలిచాయన్నారు. నేత కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

టీసీఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ

పలాసరూరల్: సాంకేతిక పరిజ్ఞానంపై ఆధునిక సమాజం ఆధారపడి ఉందని బ్రాహ్మణ తర్లా జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్వీ రమణారావు అన్నారు. బుధవారం పాఠశాలలో టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టాటా బిల్డ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్మార్ట్ ఇండియా' అంశంపై వివిధ విభాగాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఈదులవలస(పోలాకి): ఈదులవలస 11కేవీ రూరల్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఈదులవలస, రాళ్లపాడు, ముప్పిడి, దీర్ఘాశి, తోటాడ, కింజరాపువానిపేట, ఎస్ఎల్‌పురం, కొండలక్కివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రేపు అనంతపురం సబ్ స్టేషన్ పరిధిలో..

పలాస: అనంతపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఐఎస్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా శ్రీనివాసనగర్, రోటరీనగర్, నెహ్రూనగర్, నిత్యానంద్ నగర్, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, పండా క్వార్టర్స్, వెంకటేశ్వరకాలనీ, పూజారి వీధి, నిత్యానంద నగర్, జడ్‌పి హైస్కూల్ రోడ్డు, పద్మనాభపురం కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, పారిశ్రామికవాడ, రెంటికోట, నెమలి నారాయణపురం, తిలక్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పట్టణ పరిధిలో..

నరసన్నపేట: నరసన్నపేట టౌన్ ఫీడర్-1లో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు గాంధీనగర్, కొత్తవీధి, నాయుడువీధి, నేతాజీవీధి, భవానీపురం, దేశవానిపేట, పీఎన్ కాలనీ, లచ్చుమన్నపేట, ఆదివారంపేట, వీరన్నాయుడు కాలనీ, తిరుమలవీధి, బొరిగివలస, ఈదులవలస తదితర ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో..

జలుమూరు: చల్లవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శ్రీముఖలింగం ఫీడర్‌పై చెట్టు కొమ్మలు తొలగించే పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు కెల్లివానిపేట, పెద్దనామానపేట, చిన్ననామానపేట, గంగాధరపేట, సుబ్రమణ్యపురం, వెంకటాపురం, జోనంకి, ఊడిగలపాడు, లింగాలపాడు, తలతరియా, ఎర్రన్నపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారవకోటలో..

జలుమూరు, (సారవకోట): సారవకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ బొంతు ఫీడర్‌పై మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా బురుజువాడ, అర్లి, కోనవానిపేట, అన్నుపురం, వాబ, అన్నుపురం, చిన్నగుజ్జువాడ, పెద్దగుజ్జువాడ, కొమ్ముసరియాపల్లి, బెజ్జి, వాండ్రాయి, మూగుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరిం చాలని కోరారు.

మండల పరిధిలో..

పాతపట్నం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొరసవాడ ఆర్ఎల్‌పురం ఫీడర్‌లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నామన్నారు. అందువల్ల బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, గోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

పాతపట్నం తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ ప్రారంభం

జలుమూరు: పెద్దదూగాం గ్రామంలో పాతపట్నం తల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా మంగళ వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలతో ఆలయానికి చేరుకుని ముర్రాటలు సమర్పించి అమ్మవారికి చల్లదనం చేశారు. గ్రామ పురోహితులు మావుదూరి జగదీష్ శర్మ నేతృత్వంలో ముర్రాటలు సమర్పించారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

అధిక లోడ్‌తో ఆటోలు నడిపితే చర్యలు

వజ్రపుకొత్తూరు: అధిక లోడ్‌తో ఆటోలను నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సీహెచ్ రామారావు అన్నారు. ఆటో యూనియన్ సభ్యులతో బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. మద్యం సేవించి ఆటోలు నడవద్దన్నారు. నిబంధనలను అనుసరించి నడుచుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా కలిగి ఉండాలన్నారు. వర్షాలు పడుతున్నందున అతివేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రమాదాలు నివారణకు ఆటో డ్రైవర్లు బాధ్యత వహించాలన్నారు. అనంతరం డ్రైవర్ల లైసెన్స్‌లను తనిఖీ చేశారు.


మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

పాముకాటుతో వృద్ధుడి మృతి

మెళియాపుట్టి: గంగరాజపురం గ్రామానికి చెందిన అభిమన్య దొళాయ్ (64) పాము కాటుకు గురై మృతి చెందినట్లు భార్య కుంతి తెలిపారు. మంగళవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా పాము కాటు వేయడంతో వెంటనే ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా వైద్య సేవలు పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.



కూటమి ప్రభుత్వంలో రైతులందరికీ న్యాయం

వజ్రపుకొత్తూరు: కూటమిప్రభుత్వంఓ రైతులందరికీ న్యాయం జరుగుతుందని తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కోనారి కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దబొడ్డపాడులో ఎరువులు పంపిణీ చేశారు. దుంపల వల్లభ, అప్పారావు, ఏవో అపర్ణ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ ఎరువులు

మెళియాపుట్టి: ప్రతి రైతుకు ఎరువులు అందించడం జరుగుతుందని టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బూర్లె లలితకుమారి అన్నారు. బుధవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. టీడీపీ నాయకులు బి.డిల్లీశ్వరరావు, శశిభూషణ్, తిరుపతిరావు, గణపతిరావు పాల్గొన్నారు.







ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

శ్రీకాకుళం క్రైం: నగరంలోని అరసవిల్లి ఆదిత్యనగర్ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కిష్టప్పపేట గ్రామానికి చెందిన పి.రామారావు తన ఆటోతో ఒప్పంగి నుంచి అరసవిల్లి మీదుగా శ్రీకాకుళం వస్తున్నాడు. అదే సమయంలో సెగిడివీధికి చెందిన బూరవిల్లి గణేష్(70) టిఫిన్ చేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన ఆటో గణేష్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన గణేష్‌ను అదే ఆటోలో రిమ్స్‌కు తరలించ, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడ ఉన్నారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ సందీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..


చిన్నారావు(ఫైల్)

ఎల్ఎన్ పేట: చిన్నకొల్లివలస ఆర్ఆర్ కాలనీకి చెందిన బి.చిన్నారావు(22) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నారావు తన స్నేహితుడు పి.శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై అలికాం వైపు నుంచి వస్తుండగా గేదెలవానిపేట వద్ద గల వయోడెక్ట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారావుకు బలమైన గాయాలు కాగా శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటర్ చదువుతున్న చిన్నారావుకు తల్లిదండ్రులు అప్పారావు, నారాయణమ్మ ఉన్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆమదాలవలస ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసులో నలుగురికి జైలు

నందిగాం: వరకట్న వేధింపుల కేసులో నేరం రుజువుకావడంతో నలుగురికి జైలుశిక్ష విధిస్తూ టెక్కలి కోర్టు జూనియర్ న్యాయాధికారి ఎస్‌హెచ్ఎన్ తేజా చక్రవర్తి బుధవారం తీర్పు చెప్పినట్టు ఎస్ఐ మహ్మద్ ఆమీర్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సైలాడ పంచాయతీ దొడ్డరామచంద్రపురం గ్రామానికి చెందిన కర్రి అప్పారావు కుమార్తె హేమలతకు మందస మండలం లోహరిబంద గ్రామానికి చెందని నర్తు హేమరాజుతో వివాహమైంది. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురంలో హేమరాజు, అతడి తల్లి కనకమ్మ, అన్నయ్య గోపాలరావు, వదిన సరోజని అదనపు కట్నం కోసం హేమలతకు చిత్రహింసలు పెట్టి ఇంటినుంచి గెంటివేశారు. ఈ నేపథ్యంలో 2018లో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి బుధవారం తీర్పు చెప్పారు. నిందితులపై నేరం రుజువుకావడంతో హేమలత భర్త హేమరాజుకు 1 నెలలు జైలు, రూ.3 వేలు జరిమానా, అతడి తల్లి, వదినలకు మూడు నెలల జైలుతో పాటు రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఏపీపీ డి.హరిప్రియ బధితురాలి తరఫున వాదించారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం క్రైం: భైరి సింగుపురం జంక్షన్‌కు వచ్చే మార్గంలో బుధవారం ఉదయం ఆరు గంటలకు లారీలో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ ప్రత్యేక బృందం పట్టుకుంది. లారీ డ్రైవర్ చిలక ఆదినారాయణ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించారు. దీంతో లారీని శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. అలాగే మైన్స్ అధికారులకు సమాచారం అందించారు. ఈ బృందంలో భైరి, కరజాడ, పొన్నాం, బట్టేరు గ్రామాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది వై.లక్ష్మణరావు, డి.పాపారావు, వీఎస్ గణేష్ ప్రసాద్. టి.యశ్వంత్ ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: ఇరువర్గాల ఫిర్యాదుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సానివాడ గ్రామానికి చెందిన యడ్ల శ్యామసుందరరావు ఈ నెల 5వ తేది రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి ముందు ఫోన్ మాట్లాడుతుండగా, ఎదురింట్లో ఉన్న మద్దిల శ్రీను వచ్చి చాకుతో పొడిచాడు. దీంతో గాయపడిన అతడిని తండ్రి అప్పారావు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించాడు. ఈ మేరకు మంగళవారం ఏఎస్ఐ నారాయణ కేసు నమోదు చేశారు. కాగా మద్దిల శ్రీను కుటుంబ విషయాల్లో శ్యామసుందర్ అతని తండ్రి అప్పారావు తరుచూ కలుగజేసుకుని తగాదాలకు కారణం అవుతున్నారని, ఈ నెల 5వ తేది రాత్రి 10 గంటల ప్రాంతంలో తండ్రీకొడుకులిద్దరూ తన ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనాన్ని కాలితో తన్ని పాడుచేశారని రూరల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: రాజాం పోలీసు స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గత నెలలో మరణించిన కె.శ్రీనివాసరావు కుటుంబానికి తోటి హోంగార్డు ఉద్యోగులు సమకూర్చిన ఒక్కరోజు వేతనం రూ.4.11 లక్షలు చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు భార్య ఉదయకుమారి కలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఆమెకు ఎస్పీ భరోసా ఇచ్చారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ఉన్నారు.

ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిపై విచారణ

ఆమదాలవలస: తోటవాడ గ్రామ క్షేత్ర సహాయకుడు పైడి సత్యనారాయణపై అదే గ్రామానికి చెందిన తాండ్ర రంగారావు మరికొంతమంది ఫిర్యాదు చేయడంతో ఉపాధి హామీ ఏపీడీ లోకేష్ విచారణ బుధవారం చేపట్టారు. ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు. గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తుగా ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీవో సురవరపు లక్ష్మీనరసమ్మ, దూసి పీహెచ్‌సీ మాజీ చైర్మన్ హనుమంతు బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.


ఎట్టకేలకు కల్వర్టు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో ఏటీ రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగిపోయి గత 20 రోజులుగా వాహనదారులు ఇబ్బందిపడ్డారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కలెక్టర్‌గారు నరక ప్రయాణం తప్పించరూ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. దీంతో బుధవారం సాయంత్రం మరమ్మతులు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి జిల్లాలోని పలు ప్రధాన ప్రాంతాలతోపాటు అంతరరాష్ట్ర రహదారి. ఈ రోడ్డులో భారీ గుంతలతో పాటు సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద కల్వర్టు కుంగిపోయి వర్షం నీరు నిలిచిపోయేది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందిపడేవారు. ఎట్టకేలకు కల్వర్టు ప్రాంతాన్ని ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టి నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు సహకరించాలి


గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఇచ్ఛాపురం: ప్రశాంత వాతావరణంలో స్కూల్ కమిటీ ఎన్నికల (ఎస్ఎంసీ) నిర్వహణకు సహకరించాలని కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనువాసరావు కోరారు. బుధవారం ఈదుపురం గ్రామాన్ని సందర్శించిన ఆయన సర్పంచ్, వైస్ ఎంపీపీలతో పాటు గ్రామ పెద్దలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, ఎంపీపీ వివేకానంద, సర్పంచ్ నర్తు ప్రసాద్ పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


చేనేత ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

పొందూరు: దేశంలో చేనేత, ఖాదీ రంగాలు వారసత్వ సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఏఎఫ్‌కేకే సంఘ కేంద్రాన్ని సందర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత ఖాదీవస్త్రాలను ప్రతీ ఒక్కరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. నేత, వడుకు కార్మికులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటాయన్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పొందూరు ఖాదీకి వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్‌కు ఎంపికైందని ఏఎఫ్‌కేకే సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వం నుంచి సంఘానికి ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తే నేత, వడుకు కార్మికులకు మంచి జరుగుతుందన్నారు. ఖాదీప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కార్మికుల ప్రతిభను అభినందించారు. కాగా ఏఎఫ్‌కేకే సంఘం ఆధ్వర్యంలో నేత, వడుకు కార్మికులను ఘనంగా సన్మానించారు.

సాయిబాబా సొసైటీ ఆధ్వర్యంలో..

పొందూరులో సాయిబాబా చేనేత సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేతవాడ నుంచి చేనేత సొసైటీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు గత ప్రభుత్వంలో రద్దుచేసిన చేనేత కార్మికుల సంక్షేమ పథకాలు తిరిగి పునరుద్ధరించాలని నినాదాలు చేశారు.

కార్యక్రమంలో చేనేత సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు, కూటమి నాయకులు సీహెచ్ రామ్మోహన్, చినరంగ, బాడాన గిరి, బి.ఉమామహేశ్వరరావు, పూడి తిరుపతిరావు, చేనేత సొసైటీ మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎ.పాపారావు, కాలెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనిస్తా


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు: చేనేతకు చేయూత ఇవ్వనున్నట్టు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అప్పాపురంలో చేనేత కుటుంబాలను ఎమ్మెల్యే కలుసుకుని చేనేత కార్మికులు నేస్తున్న వస్త్రాలను పరిశీలించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో కొన్ని రకాల కులవృత్తులు కనుమరుగవుతున్నా చేనేతకు ప్రాధాన్యం తగ్గలేదన్నారు. చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఎమ్మెల్యే సన్మానించారు.

మా స్థలాన్ని అప్పగించండి

గ్రామంలో మా చేనేత కుటుంబాలకు కేటాయించిన స్థలాన్ని వైసీపీ నాయకుల ఆక్రమణలో ఉందని, ఆ స్థలాన్ని తిరిగి అప్పగించాలని ఎమ్మెల్యేను స్థానిక చేనేత కుటుబాలు కోరాయి. ఈ సందర్భంగా ఆక్రమణకు గురైన స్థలాన్ని ఎమ్మెల్యేకు చూపించారు. దీనిపై పరిశీలించి ఈ స్థలంలో చేనేత కులాస్థులకు ఉపయోగపడేలా సామాజిక భవనాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, గంట్యాడ మహేష్, తోటయ్యదొర, లంక నారాయణరావు, పి.మధుబాబు, లుకలాపు అప్పలనాయుడు, ఆర్‌ప్రకాశరావు, రాజు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ధరించాలి

గుజరాతీపేట: చేనేత వస్త్రాలు ధరించి, చేనేత కార్మికులను ప్రోత్సహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురష్కరించుకుని నగరంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అండగా ఉంటుందన్నారు. లైన్స్‌క్లబ్ చాప్టర్ చైర్మన్ నటుకుల మోహన్, బీజేపీ నాయకులు పైడిరాజు, పి.సూర్యకుమారి, బి.రాజేశ్వరి,అట్టాడ రవిబాబ్జీ, ఎస్.తేజేశ్వరరావు, దుర్గారావు, బి.సురేష్, డి.వరలక్ష్మీ, తమ్మినేని ఉషారాణి పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ ప్రగతికి పునాదులు


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: విద్యార్థులే దేశ ప్రగతికి పునాదులని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య మనుగడకు విద్యార్థులంతా కృషిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉత్తమ శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, సర్పంచ్ లండ లక్ష్మి, ఎంపీటీసీ యామిని, మర్రిపాటి తదిరులు పాల్గొన్నారు.

తెలుగు సీఆర్‌టీలను తొలగించాలి

కవిటి: ఒడియా మాధ్యమంలోని ఐటీడీఏ పాఠశాలల్లో నియమించిన తెలుగు సీఆర్‌టీలను తొలగించి ఒడియా మైనార్టీ వారికి న్యాయం చేయాలని ఒడియా టీచర్సు అసోసియేషన్ బుధవారం రామయ్యపుట్టుగలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రాన్ని అందించారు. తెలుగు సీఆర్‌టీల స్థానంలో ఒడియా వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత డీఎస్సీలో నోటిఫై చేయని 34 ఒడియా ఉపాధ్యాయ ఖాళీలను ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేసేలా చూడాలని వారు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి ఒడియా విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే అశోక్ వారికి హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరపాడీ, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, రామహరి పాడీ, త్రిలోచన, డీపీ చౌదిరి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేట గ్రామంలో ఇంటింటికీ కొళాయిలకు సంబంధించిన పనులకు ఎమ్మెల్యే గొండు శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రతీ కుటుంబానికి సురక్షిత తాగునీరు అందిం చాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటింటికి కొళాయి కనెక్షన్ల ఇస్తుందన్నారు. సర్పంచ్ అరసవ ల్లి సత్యవతి, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆహార భద్రతకు కృషి చేయాలి

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయాభివృద్ధికి కొత్తకొత్త ప్రయోగాలకు రూపకల్పన చేసి దేశ ఆహార భద్రతకు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన నైరా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగంలో తాజా సాంకేతికతలను రైతులకు విస్తరించే కేంద్రంగా ఈ కళాశా గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ ఆరా


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: నగర పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి క్షేత్రస్థాయిలో రోడ్లన్నీ పరిశీలించి, స్వయంగా ఆయనే ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. సుమారు ఆరేళ్లుగా నగర ట్రాఫిక్ సమస్యపై అటు ట్రాఫిక్ పోలీసులు కానీ రాజకీయ నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్పీ సిక్కోలు నగర వీధులైన పొట్టి శ్రీరాములు మార్కెట్ జంక్షన్, ఇలిసిపురం, రైతు బజార్, గుజరాతీపేట, హయాతీనగరం ప్రాంతాల్లో సీఐలు ఉమామహేశ్వరరావు, సన్యాసినాయుడులతో కలిసి పర్యటించారు. ట్రాఫిక్ సమస్యకు గల కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆటో డ్రైవర్లు, స్కూల్, కళాశాల విద్యార్థులు, పాదచారులను, రైతుబజార్ నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈవ్‌టీజింగ్ ఉంటే నేరుగా ఫిర్యాదు చేయండి

జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలల్లో ర్యాగింగ్, ఆకతాయిల నుంచి ఎదురయ్యే సమస్యలు, ఈవ్‌టీజింగ్ తదితర వాటిపై ఆరా తీశారు. ఏమైన సమస్యలుంటే నేరుగా తన నెంబరు 63099 90800కి, లేదా 100కి సమచారం ఇవ్వాలని క్షణాల్లో రక్షణ కల్పించి న్యాయం చేస్తామన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ ఎస్ఐ సందీప్‌కుమార్ ఉన్నారు.

ప్రయోగాత్మకంగా ఆలోచించాలి


ఇంజనీరింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం తరగతులను వీసీ రజని బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు నీటి సరఫరా, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కళాశాలలోని ల్యాబ్‌లను పరిశీలించి నాణ్యతగా, సక్రమంగా పనిచేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావుపేటలో సాఫ్ట్‌బాల్ కోచింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల: కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర కోచింగ్ క్యాంపు బుధవారం ప్రారంభమైంది. ఈ కోచింగ్ క్యాంప్‌ను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకట రామరాజు ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరగనుంది. ఈ పోటీల్లో పాల్గొనే 25 మంది క్రీడాకారులకు కోచింగ్ 14వ తేదీ వరకు ఇవ్వనున్నారు. పాఠశాల హెచ్ఎం ఎం.సాయిరాం, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతి రావు, పీడీ ఎంవీ రమణ, పీఈటీలు జి.మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పూర్తి కావాలి

కలెక్టరేట్: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ-పంట పేరిట నమోదు పూర్తి చేయాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ డైరెక్టర్లు డిల్లీరావు, శ్రీనివాసులతో కలిసి అమరావతి నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సాయంత్రం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులకు పంట సాయం, నష్టపరిహారం, పంటల బీమా, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ ఉద్యానవన శాఖాధికారి ప్రసాదరావు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్, సెరికల్చర్ ఏడీ రాజేంద్రప్రసాద్, ఏడీలు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్ క్రీడాకారునికి కేంద్రమంత్రి సాయం


పూర్ణారావును అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

శ్రీకాకుళం స్పోర్ట్స్: దివ్యాంగాన్ని ఎదిరించి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన క్రీడాకారుడు చాపర పూర్ణారావుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ అండగా నిలిచారు. వచ్చే నెలలో ఇండోనేషియా వేదికగా జరగనున్న అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌కి పూర్ణారావు ఎంపికయ్యాడు. ఆ పోటీల్లో పాల్గొనేందుకు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నెల 4న కేంద్ర మంత్రిని కలిసిన పూర్ణారావు తన సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన డ్రీమ్ లెవెన్ క్రీడా సంస్థ ప్రతినిధులతో స్వయంగా మాట్లాడి రెండురోజుల్లోనే వంద శాతం స్పాన్సర్ షిప్ మంజూరు చేయించారు. ఇండోనేషియా పర్యటనకు అవసరమైన రూ.1.5 లక్షలు కేటాయించేలా చేశారు. కాగా పూర్ణారావు 21 ఏళ్ల వయస్సులో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో వెన్నెముక పూర్తిగా దెబ్బతింది. అయితే మనోధైర్యంతో వైకల్యాన్ని ఎదిరించిన అతడు పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా ఎదిగాడు. ఇప్పటికే దేశం తురుపున వివిధ అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని ఏడు పతకాలు సాధంచడంతోపాటు 33వ ర్యాంకులో కొనసాగుతున్నారు. తాజాగా ఇండోనేషియా చాంపియన్‌షిప్‌కు ఎంపికై, ఇబ్బందులు పడతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి సహకారం అందించడంపై పూర్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తిస్థాయిలో సాగునీరు

ఆమదాలవలస: పతి సెంటు భూమికి సాగునీరు అందిస్తామని టీడీపీ నాయకుడు తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం రూ.6లక్షలతో ఆధునికీకరించిన ఈసర్లపేట ఎత్తిపోతల పథకాన్ని పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ స్విచ్ ఆన్‌చేసి సాగునీటిని విడుదల చేశారు. టీడీపీ నాయకులు నూక రాజు, సువ్వారి డిల్లేశ్వరరావు, తమ్మినేని అమర్‌నాథ్, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ డీఈ పద్మజ, ఏఈ సునీల్ తదితరులున్నారు.

ఆదిత్యునికి లక్ష విరాళం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం, బలగ మడ్డివీధికి ప్రాంతానికి చెందిన జాక గురువులు, అచ్చమ్మ, గన్నమ్మ బుధవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,01,116 ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. వారిని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ పాల్గొన్నారు.

జనసేనలోకి రిటైర్డు డీఎస్పీ

ఇచ్ఛాపురం: కవిటి మండలానికి చెందిన రిటైర్డు డీఎస్పీ శమల్ల వరప్రసాద్ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు సమక్షంలో పార్టీలో చేరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, మత్యకార కార్యదర్శి హరిబెరా, నాయకులు దివాకర్, రోకల్ల భాస్కర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కవిటి: మత్స్యకారుల రైతు ఉత్పత్తిదారుల సంస్థ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కె.గోవిందు ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. నూతన అధ్యక్షుడు గంతి శ్రీనివాసులు, కార్యదర్శిగా లండ షన్ముఖరావు, ఉపాధ్యక్షుడు బడే మాధవరావు, కోశాధికారిగా కర్రి డిల్లేష్, సహ కార్యదర్శిగా బడే తిరుపతి తోపాటు 10మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

తిరు నక్షత్ర పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో తెలుగు నక్షత్ర పూజలు సందర్భంగా వేంకటేశ్వర స్వామికి, గోదాదేవికి అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తిరు నక్షతర పూజలు నిర్వహించారు. కోదండ రామాలయంలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

61,982 సభ్యత్వాలు

- జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి
- ప్రథమ స్థానంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ సభ్యత్వానికి జిల్లాలో విశేష స్పందన లభించింది. జూలై 18 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. రూ.500తో క్రియాశీలక సభ్యత్వ నమోదు జరిగింది. అయితే ప్రతి నియోజకవర్గంలో యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వాలను తీసుకోవడం విశేషం. వాస్తవానికి జూలై 31తో సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగిసింది. కానీ యువత నుంచి వస్తున్న స్పందన చూసి ఈ నెల 5 వరకూ గడువు పెంచారు. సోమవారం సాయంత్రం వరకూ సాగిన సభ్యత్వ నమోదులో ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచింది. ఏకంగా 11,355 సభ్యత్వాలతో ముందు వరుసలో నిలిచింది. తర్వాత స్థానాల్లో ఎచ్చెర్ల 10,136, పలాస 6,302, పాలకొండ 5,744, పాతపట్నం 5,404, రాజాం 5,259, ఆమదాలవలస 5,118, శ్రీకాకుళం 5,022, టెక్కలి 4,406, నరసన్నపేట నియోజకవర్గంలో 3,236 సభ్యత్వాలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 61,982 సభ్యత్వాలు నమోదు అయినట్టు జనసేన వర్గాలు చెబుతున్నాయి. సభ్యత్వ నమోదుకు విశేష స్పందన రావడంతో పార్టీ వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ జరగనుండడం, బీమా సౌకర్యం ఉండడంతో ఎక్కువ మంది ముందుకొచ్చారు. స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలవడం ఆనందంగా ఉందని ఆ పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళల సహకారంతోనే ఇది సాధ్యమైందని చెప్పారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

గార: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో బి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని, సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

- **కవిటి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగు, చెత్తనుంచి సంపద తయారీ తదిర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.
- **ఆమదాలవలస:** సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ప్రారంభిస్తామని, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

గుజరాతీపేట: బలగ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ, ఐటీఐలో శుక్రవారం ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో హెల్పెర్స్‌కు ఎనిమిది నుంచి ఐటీఐ అర్హత ఉండాలని, సీనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, బాటరీ ఆపరేటర్స్‌లకు ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ, ఐటీఐ ఉండాల న్నారు. పురుష అభ్యర్థులకు 18 నుంచి 35 సంవత్సరాల వయసు మధ్య ఉండాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు త మ విద్యార్హతలు, అనుభవంతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

జేఆర్ పురం సీఐగా అవతారం

రణస్థలం: జేఆర్‌పురం సీఐగా ఎం.అవతారం బుధవారం బాధ్యతులు చేపట్టారు. శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ విధులు నిర్వహించిన అవతారం ఇటీవల జరిగిన బదిలీల్లో జేఆర్‌పురం వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసి జి.రామచంద్రరావు విశాఖపట్నం వీఆర్‌కు వెళ్లారు.

రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల వివిధ సమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్టు పరీక్షల డీన్ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ 5వ సెమిస్టర్, 2016-19 రెగ్యులేషన్, 3, 5సెమిస్టర్ల రీ రీవాల్యుయేషన్ ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఆయన తెలిపారు.

పుస్తకావిష్కరణ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం అధ్యాపకుడు మజ్జి రామారావు బృందం సంపాదకత్వం వహించిన వ్యవస్థాపకత ప్రాథమిక అంశాలు అనే పుస్తకాన్ని వీసీ రజని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య రిజిస్ట్రార్ పి.సుజాత, సమన్వయకర్త పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ స్కీమ్స్ వినియోగించుకోవాలి

సరుబుజ్జిలి: పోస్టల్ శాఖ ద్వారా లభిస్తున్న స్కీమ్స్ తప్పకుండా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ (ఏఎస్‌పి) ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పురుషోత్తపురం సబ్‌పోస్టాఫీస్‌లో పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నరసింహ అప్పారావు అధ్యక్షతన డాక్ చౌపల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తపాలాశాఖ అందిస్తున్న పొదుపు, ఐపీబీపీ, జీవిత బీమా పథకాలు వల్ల కలుగు ప్రయోజనాలను గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సబ్‌పోస్టు మాస్టర్ మురళీమోహన్‌రావు, గణపతిరావు, వంశీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

శ్రీకాకుళం క్రైం: రణస్థలం మండలం జెఆర్ పురం పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నడికట్ల సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. ఆ కుటుంబానికి చేయూతనందించేందుకు 2004కి చెందిన బ్యాచ్ మేట్లు బుధవారం విజయనగంలోని అతని కుటుంబ సభ్యులకు రూ.91 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్పీని కలిసిన సీఐలు

శ్రీకాకుళం క్రైం: ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా రణస్థలం మండలం జేఆర్ పురం సీఐగా నియమితులైన ఎం.అవతారం బుధవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం సర్కిల్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. అలాగే కొత్తూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ప్రసాద్ కూడా ఎస్పీని కలుసుకున్నారు.

నూతన పద్ధతులతో తెగుళ్ల నివారణ

జి.సిగడాం: వ్యవసాయ సాగులో నూతన పద్ధతులు అవలంబించడం వల్ల తెగుళు నివారించవచ్చని ఏవో ఈఆర్ఏ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జగన్నాథవలసలో పొలంబడి నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. వీఏఏ లక్ష్మీనారాయణ, సిబ్బంది అనూష, సంతోష్‌కుమార్, రాణి, యుగంధర్ ఉన్నారు.